క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



విస్తరణ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, అధికారులు

తిరుపతి కల్చరల్: మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో అన్నారావు సర్కిల్ నుంచి ఖాదీ కాలనీ, శాంతినగర్, ప్రశాంతినగర్, మున్సిపల్ పార్క్, తిరుమల బైపాస్ రోడ్డులను కలుపుతూ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అలాగే సూరయ్యకట్ట వాసుల వినతి మేరకు శాంతినగర సూరయ్యకట్టను కలుపుతూ కనెక్టివిటీ రోడ్డును నిర్మించేందుకు ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, పవన్ గందోడి, సురేంద్రరెడ్డి, రాజేష్, ఎంఈ వెంకటరమణరెడ్డి, డీఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి

భాకరాపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లులో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. డిసెంబరు 10 నుంచి జరిగే పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరవుతారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా కార్యక్రమాలకు స్వచ్ఛందంగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు, పంచాయతీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి

పాకాల: మండలంలోని పంటపల్లి పంచాయతీ దేశిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా పెళ్లి చేసుకోబోతున్న దంపతులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. గురువారం ఈ కానుకను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి కాబోయే దంపతులు నందిని, నాగార్జునకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాజికాలు, పట్టు దుస్తులు, తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం



తిరుపతి కల్చరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ఎం.సాయిప్రసాద్ జయంతి సందర్భంగా టౌన్ క్లబ్ సర్కిల్లో గురువారం కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పేదలకు అన్నదానం, కార్మికులకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, రేవతి, కల్పన యాదవ్, శైలజ, నరసింహాచారి, శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఊటగుంట మోహన్, నేతలు చాంద్‌బాషా, హిందూస్తానీ రఫీ, మహ్మద్ రఫీ, తారక్ చౌదరి పాల్గొన్నారు.

గేట్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 28న జరిగిన ప్రాంగణ ఎంపికల్లో స్థానిక గేట్ కళాశాల విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో బీకాం చదువుతున్న విద్యార్థులు ఎమ్ఎన్‌సీ కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగాలను పొందడం విశేషమన్నారు. కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు, వృత్తి నైపుణ్యానికి సంబంధించిన శిక్షణ ఇస్తున్నామని, దీంతో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగ, ఉపాధిలో రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, రమేష్, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

గురజాడకు నివాళి

తిరుపతి కల్చరల్: దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ నినాదంతో బాల్య వివాహాలను అరికట్టి, వితంతు వివాహాలను ప్రోత్సహించిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావుకు రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు ఘన నివాళులు అర్పించారు. ఈమేరకు రంగస్థలి కార్యాలయంలో గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

జగనన్న పాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు





తిరుపతి 27వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష, కార్యక్రమానికి హాజరైన స్థానిక

- ‘ఏపీకి జగనే ఎందుకు కావాలంటే’ కార్యక్రమంలో మేయర్ శిరీష, ముద్రనారాయణ

తిరుపతి మంగళం: రాష్ట్రంలోని ప్రతిపేదవాడికి సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాలకు భరోసా కల్పించేందుకు ఉద్భవించిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని 14, 27వ డివిజన్లలో గురువారం వారు ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడు నేరుగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నగదు అందించిన నాయకుడే లేరన్నారు. ప్రతి పేదవాడికి నేనున్నానంటే భరోసా కల్పించిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. ప్రతి ఇంటా జగనన్న ఉన్నాడన్న భరోసా, ధైర్యంతో పేదప్రజలు ఎంతో సంతోషం జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లోకి ఎక్కడికి వెళ్లినా మళ్లీ జగనే మాకు సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్ వంటి మహానగరానికి దీటుగా తిరుపతిని ఇంత అద్భుతంగా అభివృద్ధి చేయగలిగామంటే జగనన్న సహకారంతోనే అన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించుకుంటే పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, పార్టీ నాయకులు తులసీయాదవ్, భరణీయాదవ్, చింతారమేష్, గీతాయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ వాసుయాదవ్, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, నందగోపాల్, అనిల్‌రెడ్డి, పసుపులేటి సురేష్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై పూర్తి దృష్టి సారించండి



ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : ఓటర్ల తుది జాబితాపై దృష్టి సారించాలని, ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం తిరుపతి నియోజకవర్గంలో నియమించిన ఓటింగ్ నమోదు అదనపు అధికారులు, సిబ్బంది, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, మృతి చెందిన వారి ఓట్లను తొలగించడంలో పూర్తి బాధ్యతాయుతంగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పని చేయాలన్నారు. ఫారం-7 విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన ఆధారాలతో జాబితా రూపొందించాలన్నారు. ఒక డోర్ నంబర్‌లో పదికి పైగా ఓటర్లు నమోదు అయితే, బీఎల్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. తిరుపతి నియోజకవర్గం ఓటర్ల లిస్టులో పూర్తిగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఓటర్ నమోదు అదనపు అధికారి, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఆర్వోలు కెఎల్ వర్మ, సేతుమాధవ్, డీటీ జీవన్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి సమీక్ష



మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

తిరుపతి సిటీ : తుపాన్ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ప్రజలకు అప్రమత్తం చేయాలని, నగరంలో ఎక్కడైనా కాలువలు పొంగినా, చెట్లు కూలినా జేసీబీల సాయంతో తొలగించేలా సిద్ధంగా ఉండాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సూచించారు. తిరుపతి నగరంలో రానున్న తుపాన్ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లలోని అన్ని విభాగాల అధికారులతో వారు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని డ్రైన్లపై దృష్టి సారించాలన్నారు. అధిక వర్షంతో ఎక్కడైనా మురుగు కాలువలు బ్లాక్ అయి నీరు రహదారులపై వస్తున్న పక్షంలో జేసీబీల సాయంతో పనులు చేపట్టేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు విరిగి రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడు నిమిషాల వ్యవధిలో తొలగించేలా సిబ్బంది, యంత్రాలు అందుబాటులో ఉండాలని సూచించారు. తిరుపతిలో 24 గంటలు పని చేసే హెల్ప్ లైన్ నంబర్ 08772256766 అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నగర శివార్లలోని కొరమీనగుంట, పూలవానిగుంట, గొల్లవానిగుంట ప్రాంతాల్లో సీల్ట్ తొలగించడం, అదనపు నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు పనులు చేపట్టాలన్నారు. అనంతరం రేణిగుంట రోడ్డులోని హీరోహోండా షోరూం వద్ద కుంగిన రోడ్డును కమిషనర్ పరిశీలించి ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేసి, త్వరగా మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్‌కుమార్, రవీంద్ర రెడ్డి, మహేష్, నరేంద్ర, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచెయ్య, సుమతి పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

తిరుపతి తుడా : తిరుపతి అర్బన్ పరిధి ప్రజలకు జగనన్న కాలనీల్లో ఇళ్లను సకాలంలో, నిర్ణయించిన మేరకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలసి గురువారం హౌసింగ్, మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలకు చిందేపల్లి, సూరప్పకశం, ఎం.కొత్తపల్లి, జీపాళెం, కల్లూరు, టీసీ అగ్రహారం లేఅవుట్లలో ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. అనుకున్న మేరకు జనవరి నెలాఖారు నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరిలో లబ్ధిదారులకు అందజేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఇటుకల కొరత రాకుండా ఇటుకలు తయారు చేసే వారితో ముందే అగ్రిమెంట్ చేసుకోవాలని, అదేవిధంగా సిమెంట్, ఇసుక కొరత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఓఎస్‌డీ రామచంద్రా రెడ్డి, పీడీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

కుక్కలపై చర్యలు తీసుకోండి



పంచాయతీ కార్యదర్శి శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న అటవీశాఖ అధికారి జమున

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: కుక్కల దాడిలో వన్యప్రాణులు ప్రాణాలు పోగొట్టుకోవడంపై ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు స్పందించారు. కుక్కల దాడులు అరికట్టేందుకు పంచాయతీ అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం ఎఫ్‌బీఓ జమున, పనపాకం పంచాయతీ కార్యదర్శి శిరీషకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం కిందట చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిందని, మూడు రోజుల కిందట మరోసారి కుక్కలు మరో దుప్పిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిందన్నారు. వాటిని స్థానికులు రక్షించి, అటవీ అధికారులు అప్పగించడంతో ప్రాణాలను కాపాడినట్లు ఆమె తెలిపారు. దీనిపై సాక్షి దినపత్రికలో ‘వేట కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పి’ అనే శీర్షికన వార్త ప్రచురితమైందన్నారు. దీంతో ఎఫ్ఆర్‌ఓ మాధవి ఆదేశాల మేరకు పంచాయతీలోని అటవీ సమీప గ్రామాల్లో కుక్కల దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ సమీప గ్రామాల్లో సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎఫ్‌బీఓ జమున తెలిపారు.

ప్రతి ఇంటా అభిమానం..



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ప్రతి ఇంటా ఎనలేని అభిమా నం.. జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల గుండెల్లో నిండుకున్న సంతోషం.. అన్నింటికీ మించి గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మికి మహిళలు ఎదురేగి కర్పూర హారతులతో ఘన స్వాగతం పలుకుతున్నారు. తిరుపతి రూర ల్ మండలం పుదిపట్ల పంచాయతీలో గురువా రం రెండవ రోజు గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టారు. జ గనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ ప్రతి గడపకు వెళ్తున్న చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ ఆదరణ లభించింది. గత ఎన్నికల్లో తన భర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని, వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు శ్రీరాములు, గోపి, బడి వెంకటేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు



ప్రసంగిస్తున్న ఎల్‌కే నటరాజన్

తిరుపతి సిటీ : విద్యతో పాటు నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని డిక్షన్ కంపెనీ ఆపరేషన్ ఉపాధ్యక్షుడు ఎల్‌కే నటరాజన్ అన్నారు. గురువారం స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఓరియెంటేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కంపెనీలో మెనేజ్‌మెంట్ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటిపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరరెడ్డి, హెచ్ఓడీలు నీరజ, శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు నాల్కుల ధోరణిని మానుకోండి



మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్

తిరుపతి కల్చరల్: పూటకో మాట, రోజుకో డ్రామా ప్లే చేస్తూ తప్పుడు ప్రచారం చేసే టీడీపీ నేతలు రెండు నాల్కుల ధోరణిని మానుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని వైఎస్సార్‌సీపీ నేత, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ హితవు పలికారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి పట్టణ అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తున్నా టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర్ నారాయణ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే గోడ కట్టాలని భూమన కరుణాకరరెడ్డి పోరాటం చేసి దానిపై కేసులు కూడా నడిచాయని గుర్తు చేశారు. రైల్వే గేటు దారి పరిష్కారం కోసం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి పార్లమెంట్‌లో ప్రస్తావించారన్నారు. అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇంజనీరింగ్ ప్రతిపాదనలు వచ్చాయని, ఇందుకోసం ఎంపీ నిధులు రూ.80 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.1.70 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో అవి పూర్తి చేస్తారని తెలిపారు. ఇప్పటికే ఆర్‌సీ రోడ్డులో అండర్ రైల్వే బ్రిడ్జి పూర్తి చేయడం జరిగిందని, త్వరలో కాటన్ మిల్లు, హీరో హోండా షోరూం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేశారని తెలిపారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు వెంకటేష్ రాయల్, అమరనాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు బత్తుల అరుణ్‌యాదవ్, మబ్బు నాథమునిరెడ్డి, చింతా రమేష్ యాదవ్, తాళ్లూరిప్రసాద్, సోము, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్

తిరుపతి కల్చరల్: యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజుపల్లిలోని సెంట్ మార్క్ చర్చిలో దైవ సేవకులకు గురువారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన దైవ సేవకుల సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ యయలమంచిలి ప్రవీణ్ హాజరై దైవ సందేశాన్ని అందించారు. దేవుడు ఎప్పుడూ జీరోని ఎన్నుకుని హీరోలుగా చేస్తారని అందుకే మొదటి సువర్తమానాన్ని గొల్లలకు తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూసీడబ్ల్యూఎస్ అధ్యక్షుడు పాల్ మనోహర్, రెవరెండ్ విండోటి బాబు, పయ్యూరు మోహనయ్య, సి.సాల్మన్‌చలో మూర్తి, దైవ సేవకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న అధికారులు

భాకరాపేట : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పథకాలను అర్హులైన వారికి అందిస్తుందని చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ దేవేంద్రబాబు తెలిపారు. గురువారం చిన్నగొట్టిగల్లు, రంగన్నగారిగడ్డ గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గ్రామ సర్పంచులు మనోహర్, యువజ్యోతి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమం వల్ల పేదల జీవితాల్లో పెను మార్పులు సంభవించాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి పంచాయతీలో..

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సర్పంచ్ గౌరీశంకర్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన 17 రకాల సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అలాగే పీఎం విశ్వకర్మ, ఆవాసయోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే లబ్ధిదారులు పొందిన లబ్ధిని వివరించి, లబ్ధిదారుల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి, నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యంలో నవలకు ప్రత్యేక స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

పాకాల: తెలుగు సాహిత్యంలో నవలకు ప్రత్యేకమైన స్థానం ఉందని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా అధ్యక్షతన ‘అసమర్థుని జీవయాత్ర’ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ త్రిపురనేని గోపీచంద్ నవలలు తెలుగు సాహిత్యాన్ని సరికొత్త మలుపు తిప్పాయని, ఆయన నవలల్లో మనోవైజ్ఞానిక, తాత్విక దృక్పథాలు ప్రధానంగా చోటు చేసుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.ఈశ్వర్‌బాబు, ఎస్.వి.రమేశ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.